# న్యూస్ రీడర్స్ జిందాబాద్!

క్రీ.శ. 2001...

రాత్రి ఏడుగంటల ఇరవైఅయిదు నిమిషాలు...

ఏడుగంటల నుండి ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించిన ప్రాయోజిత



కార్యక్రమమను దిక్కుమాలిన ఓ ప్రోగ్రాం బారినుంచి బయటపడిన హైదరాబాద్ టీవీ ప్రేక్షకులు తృప్తిగా ఊపిరి పీల్చుకున్నారు. నిత్యం

– డా॥ ఎ. యమ్. రెడ్డి

**తమ స్పాన్సర్డ్ కార్యక్రమాల ద్వారా నగటు ప్రేక్షకుల గుండెల్లో హడలు పుట్టించటంలో అద్భుతమైన రికార్డులు సాధిస్తున్న 'పెద్దమొత్తాల కమీషనరుల' తాలూకు చిత్రవిచిత్ర ప్రకటనలు- పాపం ప్రేక్షకులు బిక్కుబిక్కుమంటూ చచ్చినట్లు భరిస్తున్నారు. అహో! తెలుగు టీవీ ప్రేక్షకులు ఎంతటి సహనశీలురు!**

ఏడుగంటల ఇరవై ఎనిమిది నిమిషాలు...

వ్యాపార ప్రకటనలు నగటు ప్రేక్షకుల బలహీనతల *పైన దారుణంగా దెబ్బకొడుతున్నాయి*. సబ్బులు, షాంపూలు, నూనెలు, క్రీములు టీవీలో ఆకర్షణీయంగా ప్రవహిస్తూ సామాన్యుని హిప్నటైజ్ చేస్తున్నాయి. ఏ డిటర్జంట్‌తో అర్జంట్‌గా బట్టలుతుక్కోవాలో తెలియక మధ్యతరగతి గృహిణి జుట్టు పీక్కుంటోంది. వెంటనే అలా పీక్కుంటున్న జుట్టు తిరిగి గుత్తులు గుత్తులుగా రావాలంటే ఏం పూసుకోవాలో టీవీ అందంగా ఆడి ఆడి పాడి పాడి గోలగోలగా అరిచి చెబుతోంది.

ఏడుగంటల ఇరవైతొమ్మిది నిమిషాలు...

ఒక్కసారిగా వాతావరణం ప్రశాంతమయ్యింది. వ్యాపార ప్రకటనల దారుణగోల హఠాత్తుగా మాయమయ్యింది. రంగుల టీవీ నీలాకాశంలాగా నిర్మలంగా, నిశ్శబ్దంగా ఉంది.

7-29-05

7-29-06

డిజిటల్ టైమ్‌లో చకచకా సెకండ్లు మారిపోతున్నాయి. అలా మారిపోతున్న ప్రతి సెకనుకు- అఖిలాంధ్రదేశ మంతటా వేలాది టీవీలు హఠాత్తుగా కట్టివేయబడుతున్నాయి. టీవీలు చూసుకుంటూ వంటవనులు చేసుకుంటున్న గృహిణులు, వారపత్రికలు చదువుకుంటున్న యజమానులు, పత్రికలలో స్పోర్ట్స్ కాలమ్ గమనిస్తున్న యువకులు, కబుర్లాడుకుంటున్న యువతులు, తాపీగా హోమ్‌వర్క్ చేసుకుంటున్న కాన్వెంటు పిల్లలు, వరండాలలో పిచ్చాపాటీ మాటాడుకుంటున్న వృద్ధులు- ఒక్కరేమిటి అందరూ హఠాత్తుగా తమ తమ పనులాపి, పరుగులాటి నడకతో టీవీల దగ్గరకు దుమికి అమాంతంగా టీవీలను ఆపేస్తున్నారు. ఆ క్షణాల్లో ఆంధ్రదేశంలోని ప్రతి ఇంట్లోనూ ఒకటే దృశ్యం... టీవీల పీకలు నొక్కుతున్న కమనీయ దృశ్యం...

ఇంతకూ యావదఖిలాంధ్ర ప్రేక్షకులు అంతగా భయవిహ్వలురై నరభనంగా టీవీలనబడు తమ తమ 'బొమ్మల పెట్టెలను' ఒక్కసారిగా పరుగు పరుగున అవుటలో గల ఆంతర్యమేమిటి చెప్మా?!

వెరీ సింపుల్... ఆ సెకండ్లు అలా మారి మారి పోతుంటే కాస్సేపటికి ఏడుగంటల ముప్పై నిమిషాలవుతుంది కదా! ఇంకేముంది వెంటనే కొంపలంటుకోవూ?!



భర్తతో తొలిసారి క్లబ్‌కు వెళ్ళిన భార్యామణి
"అదేమిటండీ, సడన్‌గా ఆ జంట అలా లేచి డాన్స్ మొదలెట్టారు?"
అడిగింది.
అందుకు ఆ భర్త జాలిగా
"నువ్వు సూప్ తాగుతున్నావు కదా! అదేదో కొత్తరకం మ్యూజిక్ అనుకుని ఉంటారు పాపం? వివరించాడు.

- కె. ప్రవీణ్, బెంగుళూరు

రాత్రి 7 గంటల 30 నిమిషాలు...

హైదరాబాద్ దూరదర్శన్ కేంద్ర తెలుగు కార్యక్రమాలు తిలకించే దురదృష్ట ప్రేక్షకుల పాలిటి దుష్టఘడియలు. సరిగ్గా ఆ దుష్టఘడియల్లోనే మొదలవుతాయి-తెలుగువార్తలనబడు 'చక్కని తెలుగు' వాతలు. నవ్వలేక, నవ్వురాక బలవంతంగా తప్పదన్నట్లుగా ఏడుస్తూ నవ్వి, నోటితో నమస్కారం చెప్పి, ఆ తర్వాత రకరకాల హావభావ విన్యాసాల ద్వారా, వింతవింత విలాసాల ద్వారా, చిత్ర విచిత్రమయిన వికారాల ద్వారా దిక్కుమాలిన వార్తలతో తెలుగు ప్రేక్షకులను ఎడాపెడా వాయించి- ఆ తర్వాత మళ్లీ ఓ అరిగిపోయిన లేదా మురిగిపోయిన చెత్తనవ్వు ప్రేక్షకుల మీదకు విసిరేసి హఠాత్తుగా అదృశ్యమైపోతారు- న్యూస్ రీడర్లనబడే వింతవింత మూర్తులు.

### చిత్రలాస్యం

సినిమా ప్రారంభంలో సెన్సార్ సర్టిఫికెట్‌లో త్రికోణం చూసిన ఓ పెద్దాయన - "ఏం కాలం! ఆఖరికి సర్టిఫికెట్‌లో కూడా కుటుంబ నియంత్రణ ప్రకటనలు వేస్తున్నారయ్యో!" అని వాపోయాడట.

దానికి పక్కనున్న మరొక పెద్దాయన - "తప్పు, నాయనా! ఇది ఆ త్రికోణం కాదు. ఇలాంటి సింబల్ సర్టిఫికెట్ మీద ఉంటే, సెన్సారు వాళ్ళు విధించిన 'కట్స్' సినిమాలో ఉన్నాయని అర్థ"మని సెలవిచ్చాడట!

యు.యు.యు. [ఎమ్మిగనూరు]

ఆ న్యూస్ రీడర్ల తీరుతెన్నులు, రీతిరివాజులు చూసి చూసి, వినివిని ఇక చూడలేక, వినలేక నగటు తెలుగు ప్రేక్షకులు కలసికట్టుగా ఓ స్థిర నిర్ణయం తీసుకున్నారు- 'ఇక చచ్చినాసరే తెలుగు వార్తలు ససేమిరా చూడకూడదని-'. ఆ నిర్ణయం పర్యవసానమే-టీవీ తెర పై ఏడు ఇరవైతొమ్మిదని టైమ్ కనబడిన వెన్వెంటనే అఖిలాంధ్రదేశమంతటా ఒక్కసారిగా వేలాది, లక్షలాది బొమ్మలపెట్టెల నోరులు హఠాత్తుగా నొక్కబడటం...!

ఇంతకూ - తెలుగు ప్రేక్షకుల గుండెల్లో గుబులు పుట్టించి, మెదళ్లలో ప్రకంపనం సృష్టించి, చూపుల్లో కలవరం కలిగించిన ఆ సదరు న్యూస్ రీడర్ల అత్యద్భుతమైన కథాకమామీషు ఏమిటి-??

తెలుగు న్యూస్ రీడర్లు ముచ్చటగా, మురిపెంగా మూడు రకాలు, ఇందులో ఒకటవ రకం - తెలుగు భాషే రానివాళ్లు, రెండ రకం - తెలుగు భాష మాత్రం వచ్చి ఉచ్చారణే రానివాళ్లు, మూడవరకం - భాషా, ఉచ్చారణ వచ్చినా – ప్రేక్షకులు తప్పనిసరిగా కళ్లు మూసుకొని *మాత్రమే వార్తలు వినవలసినంతటి* 'ఫోటో జెనిక్ ఫేస్ వ్యాల్యూ' వాళ్లు. ఈ ప్రధానమైన మూడు రకాల్లోనూ మరెన్నో ఉపరకాలు—

అందులో —

ఒకాయన - నెమ్మదిగా, అతి నెమ్మదిగా, ఇప్పుడిప్పుడే తెలుగు నేర్చుకుంటున్నట్లు ప్రతి అక్షరాన్ని పట్టిపట్టి చదువుతాడు. ఆ అతినెమ్మదికి తోడు పదపదానికీ మధ్య 'బుస్' మంటూ ఆయాసం కూడా!

మరొకాయన – వెనుక ఎవరో తరుముక వస్తున్నట్లు ఒకటే పరుగు. ఆ వాక్యాల పరుగులో అర్థాలను అందుకోలేని ప్రేక్షకులు - ఆ తర్వాత వార్తలు వినటం మరిచిపోయి కేవలం 'చూడటం' మాత్రమే చేస్తారు.

ఇంకొకాయన - - పాపం అతను చేసుకున్న అదృష్టమో, ప్రేక్షకులు చేసుకున్న దురదృష్టమో గాని- అతని నోటి నిండా నాలుకే నాలుక, ఎవ్వరికీ ఏ పదమూ అర్థము కాదు, అంత కేవలం లొడ లొడ ధ్వనులే.

ఒకావిడ - కంగారు ముందు పుట్టి ఆమె తర్వాత పుట్టినట్లుగా – మాటలో, చూపులో, మనిషిలో అంతటా కంగారే. ఆ కంగారులో మాటమాటకు తప్పులు. ఆ తర్వాత అనవాయితీగా క్షమాపణలు.

మరొకావిడ - అయ్యో అసలు ఈవిడ చిన్నప్పుడు తెలుగు గుణింతం నేర్చుకుందా లేదా అనిపిస్తుంది. తెలుగు భాషకు వత్తులుంటాయన్న విషయం కూడా ఈవిడకు తెలియదల్లే ఉంది.

ఇంకొకావిడ - - ఈవిడ తరహాయే ప్రత్యేకం. రూపం అమ్మమ్మల రూపం. మాట తీరు కేవలం తన ఇంట్లో తను మాట్లాడినట్లు నెమ్మదిగా, గుస గుసగా ఉంటుంది తప్ప వార్తలు చదివినట్లు మాత్రం పొరపాటున కూడా ఉండదు.

అమ్మో! మరొకావిడుంది – ఆవిడ తీరే వేరు – ఆవిడ చూపేవేరు. ఆవిడ ప్రేక్షకులనే చూస్తున్నా -- పాపం ఆ చూపులు మాత్రం ఎక్కడో ఉంటాయి ఉ—

భాష, భావం, ఉచ్చారణ, రూపం – ఇలా ఏ అర్హతలూ లేని ఈ 'మాన్యులు' ఎలా అందలాలెక్కగలిగారు? ఎలా వార్తావరులయ్యారు.?

*** *** ***

దాచింపాడు. ఆ ఊళ్లో అప్పారావు గారు ఓ మోతుబరి, యాభై ఎకరాల మాగాణి, పదెకరాల కొబ్బరితోట, షాతిక ఎకరాల మెట్ట, రెండు ట్రాక్టర్లు, గేదెలు, ఆవులు

— అన్నీ అన్నీ సమృద్ధిగా నున్నా అప్పారావుగారి కున్న కేళితల్లా ఒక్కటే – వంశోద్ధారకుడు లేకపోవటం. కానీ – ఆంధ్రదేశం చేసుకున్న దురదృష్టమేమో కాని - ఆ ఒక్క లోటు కూడా తీరి - రాత్రి సరిగ్గా 7 గంటల 30 నిమిషాలకు సన్యాసిరావు ఈ భూమ్మీద ఊపిరి పీల్చుకున్నాడు. సన్యాసిరావు కారణజన్ముడు కాబట్టి వారు పుట్టినప్పుడే ఓ విచిత్రం జరిగిందట! తల్లి గర్భం నుండి ఈ భూమ్మీద పడిన వెంటనే - సామాన్య శిశువుల్లా కేర్‌మంటూ ఏడవక - కళ్లు చికిలించుకొని ఆ పురిటి గదిలోని టీవీ న్యూస్‌రీడర్‌ను తదేకంగా చూశాడట! ఆహా ఎంతటి చిత్రాతి చిత్రం!!

ఆ తర్వాత జరిగింది మరింత చిత్రమైన విచిత్రం. సన్యాసిరావుకు రెండేళ్లు నిండాయి, మూడేళ్లు నిండాయి, నాలుగేళ్లు కూడా నిండాయి. అయినా మాటలు రాలేదు. ఒక్కటి - ఒక్కటంటే ఒక్కటి - ఒక్కమాట కూడా రాలేదు. చివరకు అత్త, అమ్మ, అక్క – ఇలాంటి మాటలు కూడా రాలేదు. సన్యాసిరావు మూగవాడవుతాడేమోనని మోతుబరి అప్పారావుగారు, వారి కుటుంబ సభ్యులు, దాచింపాడు గ్రామస్థులు ఎంతగానో బెంబేలు పడిపోయారు. సన్యాసిరావుకు మాటలు తెప్పించటానికి ప్రయత్నాలు తీవ్రంగా ప్రారంభమయ్యాయి.

సరస్వతి పూజ చేసి 'సరస్వతి ఆకు' తినిపించారు. గోసాయి చిట్కాలు, పసుర్లు, పూతలు, తాయెత్తులూ, విభూదులూ, భూతవైద్యాలు, నాటు వైద్యాలు, మోటు వైద్యాలు – ఇలా గ్రామస్థాయిలో జరగవలసిన అన్ని తతంగాలు పూర్తయ్యాయి. అల్లోపతీ, హోమియోపతీ, ఆయుర్వేదం, యునానీ – అన్నీ అయ్యాయి. పట్టణ వైద్యం కూడా పూర్తయి రాజధానీ నగరానికి వచ్చారు.

అక్కడ రకరకాల ఖరీదైన వైద్య పరీక్షలు జరిగాయి. నిపుణులైన డాక్టర్లు సన్యాసిరావుకు ఆధునిక పద్ధతులలో 'స్పీచ్‌థెరపీ' ప్రారంభించారు. సంవత్సరంపాటు నిర్విరామంగా చికిత్స అమలు జరిగిన తర్వాత డాక్టర్లందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేస్తూ - సరిగ్గా రాత్రి 7-30 గంటలకు టీవీ న్యూస్ చదువుతున్న ఒకావిడను చూస్తూ గట్టిగా అరిచాడు. "బొ...బొ...మ్...మ్...మ్" అంటూ. ఆ ఒక్క మాటలో అటు డాక్టర్లు, ఇటు అప్పారావుగారు గొప్ప రిలీఫ్ ఫీలయ్యారు. ఆ తర్వాత డాక్టర్లు తమ చికిత్సా విధానం మార్చారు. అస్తమానం టీవీ బొమ్మలు చూపిస్తూ - సన్యాసిరావులోని రియాక్షన్స్ గమనించారు. టీవీని చూస్తూ సన్యాసిరావు ఉత్సాహం పట్టలేక గట్టిగా కేకలు వేస్తూ అరచేవాడు. ఆ అరుపులే క్రమంగా 'ముద్దముద్ద' మాటలుగా పరిణామం చెందాయి.

సన్యాసిరావుకు ఏడేళ్లు వచ్చాయి. ఇప్పుడు దాదాపుగా అన్ని మాటలు పలుకుతాడు. కానీ - చిక్కల్లా ఆ మాటలను డాక్టర్లు, అప్పారావుగారు మాత్రమే అర్థం చేసుకోగలరు. ఆ మాటలన్నీ ముద్దముద్దగా, సంగి సంగిగా, నత్తినత్తిగా, గులకరాళ్లు డబ్బాలో వేసి మోగించినట్లుగా, రైలు బ్రిడ్జిమీద పరుగులు తీసినట్లుగా, రేకుముక్కతో ఇనుపేల మీద బరబరా గీసినట్లుగా - పరమదారుణంగా ఉంటాయి. దాచింపాడులోని ఎలిమెంటరీ స్కూలులోనూ, నక్కలదిన్నెలోని హైస్కూలులోనూ, కుక్కలవంకలోని కాలేజిలోనూ - అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకులు సన్యాసిరావు మాటలను అర్థం చేసుకోలేక జుట్టు పీక్కునేవారు.

ఆ తర్వాత సినిమాటిక్‌గా ఓ సంఘటన జరిగింది. మనం ఏ మాటకామాట చెప్పుకోవాలి. మన సన్యాసిరావు



ఎంపిక

భర్త : ఏమిటీ! ఇదా సువ్ తెచ్చిన కొత్తచీరేనా ఇది? నా ముఖంలాగుంది! అయినా నీకు ఎంపిక చేయడం చేతకాదులేవే!

భార్య : మరే! మిమ్మల్ని ఎంపిక చేసుకొన్న తరువాతే తెలిసింది ఆ విషయం.

సిహెచ్. లక్ష్మీనారాయణ
[దరిశి]

మాట తీరు ఎంత ఘోరమైనా, మనిషి తీరుమాత్రం సూపర్. పెదవి విప్పి మాట్లాడకుండా ఉంటే సన్యాసిరావు ఏ తెలుగు హీరోకు తీసిపోడు. నోటినిండా తిరగని నాలుకను బెట్టి అన్యాయం చేసిన దేవుడు - పదేపదే చూడాలనిపించే రూపాన్నిచ్చి న్యాయం చేశాడు.

చూడచక్కనైన సన్యాసిరావు ఓ గొప్పింటి ముద్దుగుమ్మకు అమాంతంగా నచ్చాడు. ఆ అమ్మాయి గుండెలో సినిమా ఫైపు ప్రేమ వరదలా తన్నుకు వచ్చింది. ఆ ప్రేమ ఉధృతిని తట్టుకోలేక సన్యాసిరావును పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడింది. తన్నకుండానే బూరెల బుట్టలో పడ్డ సన్యాసిరావు - ఆ గొప్పింటి అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి ఓ చిన్న షరతు పెట్టాడు. తనకు వెంటనే ఓ ఉద్యోగం కావాలన్నాడు - అదీ హైదరాబాద్ దూరదర్శన్‌లోనే - అందులోనూ న్యూస్‌రీడర్ ఉద్యోగమే.



అందరూ కాదు

పాప: ప్రతి వాళ్లు కథలు చెప్పే ముందు పూర్వం ఒక రాజుండే వాడు అనే ఎందుకు మొదలు పెడ్తా రమ్మ.

తల్లి: అందరూ అలా కాదు. మీ నాన్న గార్నే చూడూ. కొంచెం ఆలస్యం అవగానే "అబ్బా ఈ రోజు ఆఫీసులో ఒకటే పని అని మొదలు పెట్టరూ."

రఘు, [సికింద్రాబాద్]

ఎస్...ఎస్... డబుల్ ఎస్.

రాజులు తలుచుకుంటే - నో నో - మంత్రులు తలుచుకుంటే ఉద్యోగాలకు కొదువేమిటి? ఓ శుభరాత్రిలో సరిగ్గా 7-30 గంటలకు బుల్లితెరపైన న్యూస్‌రీడర్‌గా కనపడ్డాడు సన్యాసిరావు.

అంతే!

అఖిలాంధ్ర ప్రేక్షకులు భయంతో గజగజలాడిపోయారు.

★ ★ ★

శ్రీమాన్ సన్యాసిరావుగారు న్యూస్ రీడర్‌గా పరిణామం చెందాక బుల్లితెరపైన ఎన్నెన్నో మార్పులు చకచకా జరిగిపోయాయి. సన్యాసిరావుగారి గాత్ర మాధుర్యం, ఉచ్చారణ గమనించిన తర్వాత ఎందరో యువతీ యువకులు సమధికోత్సాహంతో తామూ న్యూస్ రీడర్లు కావడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. మంత్రులతో, అధికారులతో పైరవీలు సాగించారు. ప్రయత్నించే వనరులు తెలియాలే గానీ మన ప్రజాస్వామ్యంలో కానిదేముంది. ఎందరి ప్రయత్నాలో ఫలించాయి. ఎందరెందరో 'వినూత్న' న్యూస్ రీడర్లు పుట్టుకువచ్చారు. రూపం, భాష, భావం, ఉచ్చారణ - ఇవేవీ లేకపోవడమే వీరిందరి 'ప్రత్యేక అర్హత'.

ఆరు నెలలు తిరగకుండానే దూరదర్శన్ నిండా సన్యాసిరావులు, సన్యాసమ్మలు తయారయ్యారు. తామరతంపరగా వచ్చిన ఈ సన్యాసిరావులు, అమ్మల వలన ఎన్నో నష్టాలున్నా కొందరికి లాభం లేకపోలేదు. టీవీలో వార్తలు చూసే దిక్కు లేకపోవడంతో వార్తల కొరకు పత్రికల సర్క్యులేషన్ గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని టీవీలన్నీ ఒకేసారి కట్టివేయబడడంతో విద్యుత్ ఆదా పెరిగి - వ్యవసాయ, పరిశ్రమల రంగంలో ఉత్పత్తి బాగా పెరిగింది. న్యూస్ రీడర్ల పట్టుచీరలు, నగలు ఏమధ్య తరగతి గృహిణీ చూడడం లేదు కాబట్టి - గతంలోలా వారినుండి సగటు భర్తలకు వేధింపు తప్పింది. పత్రికలలో కార్టూన్స్‌కు, జోక్స్‌కు కావలసినంత మేత దొరికింది. అలా అలా అనంత లాభాలతో వెలిగిపోయింది బుల్లితెర.

★ ★ ★

రాత్రి 7-30 గంటలు.

ఆంధ్ర దేశంలోని టీవీలలో తెలుగు వార్తలు రావలసిన సమయం.

వార్తలు మొదలయ్యాయి కూడా!

కానీ చిత్రం... రాష్ట్రమంతటా ఎక్కడా ఏ టీవీ కూడా 'ఆన్'లో లేదు. ఎక్కడా ఎవ్వరూ వార్తలు చూడడం లేదు. కనీసం కళ్లు మూసుకొనైనా వినడం లేదు.

మరలాంటప్పుడు ఆ వార్తలు ఎవరికోసం? ఎందుకోసం?

ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రతిపక్షాలు అసెంబ్లీలో దూరదర్శన్‌ను, దాని వెనుకనున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దుమ్ము దులిపాయి.

ప్రభుత్వం కళ్లు తెరచింది.

అఖిలాంధ్ర ప్రేక్షకుల తెలుగు వార్తలను ఆసక్తితో, అభిరుచితో ఆదరించాలంటే ఏ చర్యలు తీసుకోవాలో నిర్ణయించడానికి ఒక కమిటీని నియమించింది ప్రభుత్వం.

ఆ కమిటీకి ఛైర్మన్ శ్రీమాన్ సన్యాసిరావుగారే!!